క్లుప్తంగా

విజ్ఞాన్‌లో 'ఏ వీక్ టుబీ డిఫరెంట్'


మొక్కలు నాటుతున్న కళాశాల రెక్టార్ మధుసూదనరావు

అగనంపూడి: దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో 'ఏ వీక్ టుబీ డిఫరెంట్' పేరిట వారం రోజుల పాటు క్రీడా, సాంస్కృతిక, సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు ఆవరణలో వివిధ రకాల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో నూతనోత్తేజం నింపేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. విజ్ఞాన్ సీఈవో ఎస్.శ్రీకాంత్, ప్రిన్సిపాల్ జె.సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్ రవీంద్ర, డీన్లు సతీష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీవారాహిదేవిగా శ్రీమహాదుర్గ

అమ్మవారికి సహస్ర గులాబీ పుష్పార్చన


లక్ష్మీవారాహిదేవి అలంకరణలో మహాదుర్గ అమ్మవారు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ త్రిశక్తి దేవాలయంలో వారాహి నవరాత్రుల పూజలు నిర్వహించారు. ఆషాడ శుద్ధ పాడ్యమి నుంచి ఆషాడ శుద్ధ దశమి వరకు నిర్వహించనున్న పూజా కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం శ్రీమహాదుర్గను లక్ష్మీ వారాహిదేవి అవతారంలో అలంకరించారు. ఆలయ ప్రధానార్చకులు ఫణిశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి సహస్ర గులాబీ పుష్పార్చన చేశారు. ధనప్రాప్తి, రుణ విమోచన జరిగేలా చూడాలంటూ ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ట్యాంకర్ ఢీకొని యువకుడి మృతి


క్రాంతికుమార్ (ఫైల్)

పెదగంట్యాడ: గంగవరం పోర్టు వంతెనపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. న్యూపోర్టు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దాసరి వీధిలో నివాసం ఉంటున్న దాసరి క్రాంతికుమార్ (22) డిప్లొమా పూర్తి చేసి, ఉద్యోగాన్వేషణలో ఉన్నాడు. సోమవారం రాత్రి 8.15 గంటల సమయంలో తన ద్విచక్రవాహనంలో పెట్రోల్ వేయించుకునేందుకు పోర్టు వంతెనపై నుంచి పెట్రోల్ బంక్‌కు వెళ్తుండగా, వెనుక నుంచి వచ్చిన ట్యాంకర్ ఢీకొట్టింది. దీంతో ఆ యువకుడు రోడ్డుపై పడిపోయాడు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది యువకుడిని చికిత్స నిమిత్తం కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి 10.30 గంటల సమయంలో మృతి చెందాడు. మృతుని తండ్రి దాస రి శంకరరావు ఫిర్యాదు మేరకు న్యూపోర్టు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రేపటి నుంచి 'ఇంటింటికీ కేంద్ర పథకాలు'

గాజువాక: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ఈ నెల 22 నుంచి ఇంటింటికీ ప్రచారం చేయనున్నట్టు బీజేపీ జిల్లా ఇన్‌చార్జి పుట్ట గంగయ్య తెలిపారు. గాజువాకలో మంగళవారం నిర్వహించిన పార్టీ కీలక నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటింటికీ కేంద్ర పథకాల పేరుతో నిర్వహించనున్న ఈ కార్యక్రమాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు జయప్రదం చేయాలని కోరారు. బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, నాయకులు సిరసపల్లి నూకరాజు, పొలిమేర శ్రీను, శశిధరణ్ పిళ్లె, వ్రి లలిత తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా జగన్నాథుడి రథయాత్ర

జగన్నాథుడి రథచక్రాలు కదిలాయి. ఆషాడ శుద్ధ విదియ సందర్భంగా మంగళవారం తొలి రథయాత్రను వైభవంగా నిర్వహించారు. బలభద్ర, సుభద్ర సమేతుడైన స్వామి నేత్రపర్వంగా దర్శనమిచ్చారు. స్టీల్‌ప్లాంట్, అగనంపూడి, పెద గంట్యాడ హెచ్‌బీ కాలనీ తదితర ప్రాంతాలు రథయాత్రతో శోభాయమానంగా దర్శనమిచ్చాయి.

- స్టీల్‌ప్లాంట్, అగనంపూడి, హెచ్‌బీ కాలనీల్లో సందడి
- బంగారు చీపురుతో రథాన్ని శుభ్రం చేసిన స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్


స్టీల్‌ప్లాంట్‌లో జగన్నాథుడి రథాన్ని బంగారు చీపురుతో ఊడుస్తున్న స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ మహంతి


ఆలయ మర్యాదలతో ఎమ్మెల్యే నాగిరెడ్డికి ఆహ్వానం పలుకుతున్న ఆలయ కమిటీ, పండా కుటుంబీకులు


బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథస్వామి

ఉక్కునగరం: జగన్నాథుని రథయాత్ర ఉక్కునగరంలో మంగళవారం వైభవంగా జరిగింది. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ముందుగా స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (కమర్షియల్) డి.కె. మహంతి దంపతులు జగన్నాథునికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథుని ఉత్సవ విగ్రహాలను రథం పై కొలువుదీర్చారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మహంతి సంప్రదాయ దుస్తుల్లో బంగారు చీపురుతో రథాన్ని శుభ్రం చేశారు. పెద్ద ఎత్తున హాజరైన భక్తుల జయ జయధ్వానాల మధ్య రథం ఉక్కునగరంలోని పలు సెక్టార్ల మీదుగా సెక్టార్-8లోని ఇంద్రద్యుమ్న హాలుకు చేరుకుంది. రథయాత్రలో భజనలు, కోలాటాలు, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ ఉన్నతాధికారులతో పాటు ఉత్కళ్ కల్చరల్ అసోసియేషన్ ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

కదిలిన జగన్నాథ రథచక్రాలు

అగనంపూడి: అగనంపూడిలో వేంచేసియున్న జగన్నాథస్వామి రథయాత్ర కనులపండువగా జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే తొలిపూజ చేసిన అనంతరం రథయాత్ర ఆలయం నుంచి ఇంద్రద్యుమ్న హాలు వరకు సాగింది. ఆలయ వ్యవస్థాపకులు, పండా కుటుంబీలు రథాన్ని లాగడంతో కార్యక్రమం ప్రారంభమైంది. భక్తులు పోటీ పడి రథాన్ని లాగారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, ప్రసాద్, కమిటీ చైర్మన్ జెర్రిపోతుల సమర, పండా కుటుంబ పెద్దలు గురు త్రినాథ్ మోహన్, గోవింద్, సంతోష్, కమిటీ ప్రతినిధులు నక్కా రమణబాబు, గెద్దాడ సత్యవతి, నాయకులు కొలిపాక అప్పారావు, మామిడి శ్రీను, నెల్లి శ్రీను, దానబాల అప్పలనాయుడు, గెద్దాడ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు. ఇంద్రద్యుమ్న హాలు వద్ద దశావతారాల్లో స్వామి దర్శనమీయనున్నారు.

హెచ్‌బీ కాలనీలో..

పెదగంట్యాడ: హౌసింగ్ బోర్డు కాలనీలోని జగన్నాథస్వామి ఆలయంలో రథయాత్రను కనులపండువగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు రథం లాగారు. ఆలయ ప్రధాన అర్చకుడు ప్రమోద్ సారంగి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి స్వామి వారిని దర్శించుకున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో జీలకర్ర రమణ, భువనేశ్వరి, మంత్రి శంకర నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గౌరీ సేవాసంఘం ఆధ్వర్యంలో..

అక్కిరెడ్డిపాలెం: గాజువాకకు చెందిన శ్రీ గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో రథయాత్రను ఘనంగా నిర్వహించారు. రథయాత్రను మంగళవారం సాయంత్రం భెల్ సిగ్నల్ పాయింట్ వద్ద ప్రసన్న వేంకటేశ్వరాలయం నుంచి రథయాత్ర ప్రారంభమైంది. ఆలయ కమిటీ చైర్మన్ గంధ్రెడ్డి రామునాయుడు పూజలు నిర్వహించి ప్రారంభించారు. కార్యక్రమంలో గౌరీ సేవా సంఘం అధ్యక్షుడు, ప్రసన్న వెంకటేశ్వరాలయం పాలక మండలి సభ్యుడు బొడ్డేడ అచ్చింనాయుడు, సంఘం సభ్యులు పెంటకోట అప్పల నాయుడు, కొణతాల కృష్ణ, కోయిలాడ నాగేశ్వరరావు, ఆడారి విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


ఉక్కునగరం రథయాత్రలో మహిళల కోలాటం


ప్రసన్న వేంకటేశ్వరాలయం వద్ద ..


రథం లాగుతున్న ప్రజాప్రతినిధులు

యోగాతో ఆనందం.. ఆరోగ్యం

పెదగంట్యాడ: ఉరుకుల, పరుగుల జీవితంలో ఒత్తిడి నుంచి బయటపడేందుకు యోగా ఉత్తమ మార్గమని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. దీర్ఘకాలిక వ్యాధులు, మందులకు లొంగని రుగ్మతలను యోగా ద్వారా నయం చేయవచ్చని చెబుతున్నారు. క్రమబద్ధమైన జీవనవిధానానికి యోగా దోహదం చేస్తుందని వివరిస్తున్నారు. నిత్యం యోగా, ధ్యానం చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంతో పాటు ప్రశాంతమైన జీవనాన్ని సాగించవచ్చంటున్నారు అహింసా పిరమిడ్ ధ్యాన కేంద్రం నిర్వాహకులు మీసాల శివ గణేశ్వరరావు, వనిత. వీరు 13 సంవత్సరాలుగా ఉచితంగా యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తూ వస్తున్నారు.


యోగసాధన చేస్తున్న అభ్యాసకులు

యోగాతో ప్రశాంతత



నిరంతరం ఆనందంగా, ఆరోగ్యంగా జీవించడానికి యోగా దోహదం చేస్తుంది. పనిలో అలసట ఉండదు. ఎంత పనినైనా సులువుగా చేయగలుగుతారు. మానసిక ప్రశాంతతకు ధ్యానం ఉపకరిస్తుంది. దీని వల్ల చాలా ఆరోగ్యంగా, ఆనందంగా ఉండగలం. తల తిరగడం, నరాల బలహీనత వంటి సమస్యల నుంచి విముక్తి లభిస్తుంది.

–మీసాల శివ గణేశ్వరరావు, వనిత, అహింసా పిరమిడ్ ధ్యాన కేంద్రం నిర్వాహకులు

గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది



ప్రపంచానికి భారతదేశం అందించిన అద్భుత కానుక యోగశాస్త్రం. యోగాసనాల వల్ల శరీరంలో అన్ని భాగాలకు రక్తప్రసరణ సక్రమంగా జరుగుతుంది. గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది. క్రమం తప్పకుండా యోగా చేయడం వల్ల ఉత్సాహంగా ఉంటారు. శరీరం, మనస్సును ఏకం చేయడమే యోగా పరమార్థం.

–డాక్టర్ అపర్ణ, కిమ్స్ ఐకాన్ కన్సల్టెంట్ ఫిజియోథెరపిస్ట్

22ఏ జాబితా నుంచి విముక్తిపై హర్షం

ఎమ్మెల్యే నాగిరెడ్డికి ఘన సత్కారం

పెదగంట్యాడ: తమ భూములు, ఇళ్లు 22ఏలో ఉండిపోవడం వల్ల వాటిని అమ్మాలన్నా, కొనాలన్నా ఇబ్బందులు ఎదురయ్యేవని, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కృషితో విముక్తి లభించిందని వైఎస్సార్ సీపీ నాయకుడు గొందేశి పెదరెడ్డి అన్నారు. మండలంలోని గొందేశివీధి, కండిపిల్లివీధి ప్రాంతానికి చెందిన భూములు, ఇళ్లు 22ఏ జాబితాలో చేర్చడంతో ఆయా ప్రాంత ప్రజలు ఇబ్బంది పడేవారు. ఇప్పుడు ఆ సమస్య తొలగిపోవడంతో కండిపిల్లి వీధిలోని దుర్గాలమ్మ గుడి వద్ద ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డికి అభినందన సభ నిర్వహించారు. ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగిరెడ్డి మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా ఈ సమస్యపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితో చర్చిస్తున్నామన్నారు. గత ప్రభుత్వ హయాంలోనే ఈ భూములను 22ఏ జాబితాలో చేర్చారని తెలిపారు. ఇప్పుడు ఈ సమస్యకు పూర్తిస్థాయిలో పరిష్కారం లభించిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, మార్టుపూడి పరదేశి, గొందేశి మహేశ్వరరెడ్డి, గొందేశి వెంకటరమణారెడ్డి, అప్పలరెడ్డి, గొందేశి రాము, కృష్ణారావు, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డిని సత్కరిస్తున్న నాయకులు

ఘనంగా దుర్గాదేవి పండగ

గాజువాక: స్థానిక గోపాలరెడ్డినగర్‌లో దుర్గాదేవి పండగ మహోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి మహిళలు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. గోపాలరెడ్డినగర్ పరిసర గ్రామాల ప్రజలు అమ్మవారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేశారు. కార్యక్రమంలో 76వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు చిక్కా సత్యనారాయణ, మంత్రి శంకరనారాయణ, గోపాలరెడ్డినగర్ గ్రామ కమిటీ సభ్యులు దొడ్డి రామకృష్ణ, తెంటు సత్యనారాయణ, చిన్నారావు, పాపారావు తదితరులు పాల్గొన్నారు.


అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి తదితరులు

స్టీల్‌ప్లాంట్ కార్మికుల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న సీజీఎం, కార్మిక నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికుల ఆత్మీయ సమ్మేళనం మంగళవారం సందడిగా జరిగింది. 1993 సంవత్సరం బ్యాచ్ కార్మికులు 30 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సెక్టార్–1 స్టీల్‌క్లబ్‌లో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. స్టీల్‌ప్లాంట్ స్టీల్ మెల్ట్ షాప్–1 సీజీఎం పి. శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ అభివృద్ధిలో ఉక్కు కార్మికుల పాత్ర ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, అయోధ్యరామ్, కె.ఎస్.ఎన్. రావు, నీరుకొండ రామచంద్రరావు పాల్గొని కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఐక్య పోరాటాలతో 'ఉక్కు' పరిరక్షణ

కూర్మన్నపాలెం: కార్మికులు చేస్తున్న ఉద్యమానికి కేంద్రప్రభుత్వం దిగివచ్చి, విశాఖ ఉక్కు కర్మాగార అమ్మకపు ప్రతిపాదనను వెనక్కి తీసుకోక తప్పదని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 859వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో సంస్థకు చెందిన పలు విభాగ కార్మికులు పాల్గొని, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలను కార్మికులంతా ఐక్యంగా ఎదుర్కొంటామన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.


859వ రోజు దీక్షలో పాల్గొన్న ఉక్కు పోరాట కమిటీ నాయకులు

స్టీల్‌ప్లాంట్ క్వార్టర్స్‌లో చోరీ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సెక్టార్–3లోని క్వార్టర్స్‌లో సోమవారం రాత్రి చోరీ జరిగింది. బంగారు, వెండి వస్తువులు అపహరణకు గురయ్యాయి. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన సమాచారం మేరకు వివరాలివి.. స్టీల్‌ప్లాంట్‌లో సీనియర్ టెక్నీషియన్‌గా విధులు నిర్వహిస్తున్న జమ్మాన మోహన్‌కుమార్ సోమవారం రాత్రి షిఫ్ట్‌కు విధులకు వెళ్తూ, భార్య, పిల్లలను ఇంట్లో ఉంచి బయట తాళం వేశారు. భార్య ప్రమీల పిల్లలతో బెడ్ రూమ్‌లో పడుకుని గడియ వేసుకున్నారు. తెల్లవారుజామున రెండున్నర గంటల సమయంలో ఇంట్లోకి ఇద్దరు వ్యక్తులు ప్రవేశించారు. ఆ శబ్దం విని బయటకు వచ్చిన ప్రమీల రెండో బెడ్‌రూమ్ బయట ఇద్దరు వ్యక్తులను గమనించారు. వారు ఆమెను చూసి పట్టుకునేందుకు ప్రయత్నించగా, వెంటనే ఆమె బెడ్‌రూమ్‌లోకి వెళ్లి గడియ వేసుకున్నారు. ఆమె తన భర్తకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వడంతో, వెంటనే ఆయన ఇంటికి చేరుకున్నారు. అప్పటికే బయట తలుపు విరగ్గొట్టి ఉండటం గమనించిన మోహన్‌కుమార్ ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలు తెరిచి, అందులో బట్టలు కింద వేసి ఉన్నాయి. బీరువాలో వస్తువులను తనిఖీ చేయగా నల్లపూసల దండ, లాకెట్‌తో కూడిన చెయిన్, ఐదు చిన్న ఉంగరాలు, రెండు జతల చెవి రింగులు వెరసి నాలుగు తులాల బంగారం, 10 తులాల వెండి వస్తువులతో పాటు రూ.8500 నగదుతో మొత్తం రూ. 1,13,500 అపహరణకు గురైనట్టు గుర్తించారు. బాధితుల ఫిర్యాదుతో స్టీల్‌ప్లాంట్ క్రైం ఎస్‌ఐ ఎల్. శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ఇంట్లో తెరిచి ఉన్న బీరువా, చిందరవందరగా బట్టలు

పోతిన సన్యాసిరావుకు నివాళి

ఉక్కునగరం: కమ్యూనిస్ట్ పార్టీ నాయకుడు, మాజీ శాసనసభ్యుడు దివంగత పోతిన సన్యాసిరావుకు స్టీల్ ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు నివాళులర్పించారు. యూనియన్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో సన్యాసిరావు చిత్రపటానికి నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఏఐటీయూసీ జాతీయ ఉపాధ్యక్షుడు డి. ఆదినారాయణ మాట్లాడుతూ ఉక్కు కర్మాగారంలో నిర్వాసితులకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో సన్యాసిరావు చేసిన పోరాటం మరువరానిదన్నారు. కార్యక్రమంలో నాయకులు కె.ఎస్.ఎన్. రావు, కె.రాజబాబు, టి.సత్యనారాయణ, జయ, ప్రసాద్, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.


పోతిన సన్యాసిరావుకు నివాళులర్పిస్తున్న నాయకులు

108 అంబులెన్స్‌ల ఫిట్‌నెస్ పరిశీలన

మహారాణిపేట : రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని 108 అంబులెన్స్‌లను అధికారులు మంగళవారం పరిశీలించారు. అంబులెన్స్ పనితీరు, డ్రైవర్ల లైసెన్సులు, వాహనాల ఫిట్‌నెస్ తదితర అంశాలను పరిశీలించి డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. రికార్డులు పరిశీలించారు. సంఘటన స్థలానికి 15 నిమిషాల్లో చేరుకునేందుకు డ్రైవర్లకు సూచనలు అందజేసి, సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫ్లీట్ మేనేజర్ జగ్గరాజు, విశాఖపట్నం సిటీ కోఆర్డినేటర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పతకాలు సాధించిన క్రీడాకారులకు వీసీ అభినందన

విశాఖ స్పోర్ట్స్: ఖేలో ఇండియా పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులన ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి అభినందించారు. గౌతమబుద్ధ విశ్వవిద్యాలయంలో జూన్ 3వ తేదీతో ముగిసిన ఖేలోఇండియా విశ్వవిద్యాలయాల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో 64 కేజీల వెయిట్ కాటగిరీలో ఎస్.పల్లవి స్వర్ణాన్ని సాధించింది. 87 కేజీల్లో టి.సత్యజ్యోతి రజతాన్ని సాధించగా... 45 కేజీల విభాగంలో బి.రాజేశ్వరి, 89 కేజీల వెయిట్‌లో ఎం.మణికంఠ కాంస్యాలు అందుకున్నారు. ఏయూ తరుపున పాల్గొన్న వీరందరినీ వీసీతో పాటు రిజిస్ట్రార్ వి.కృష్ణమోహన్ అభినందించారు. ఈసందర్భంగా వీసీ మాట్లాడుతూ పతకాలు సాధించిన క్రీడాకారులకు నగదు ప్రోత్సాహాలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏయూపీఈ విభాగ సంచాలకుడు విజయ్‌మోహన్, హెడ్ ఎ.పల్లవి తదితరులు పాల్గొన్నారు.


క్రీడాకారులను అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

రోడ్డెక్కిన మురుగు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు పరిధిలో కొండవాలు ప్రాంతాల నుంచి మురుగు నీరు రోడ్డుపైకి వచ్చి చేరుతోంది. రాజీవ్‌నగర్, కాళికా నగర్ ప్రాంతవాసులు ఇష్టానుసారం అక్రమ నిర్మాణాలు చేపట్టడం వల్ల కనీసం డ్రైనేజీలకు అవుట్‌లెట్ లేని పరిస్థితి. దీంతో వాడుకనీరు డ్రైనేజీల ద్వారా రోడ్డుపైకి వచ్చి చేరుతోంది. రోడ్డుపై మురుగుతో వాహనచోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.


రాజీవ్‌నగర్ నుంచి మిందివైపు రోడ్డుపై మురుగు

మూడు స్కూల్ బస్సులపై కేసులు

గోపాలపట్నం: రవాణా శాఖ అధికారులు చేపట్టిన తనిఖీల్లో ఫిట్‌నెస్ లేని మూడు స్కూల్ బస్సులపై కేసులు నమోదు చేశారు. మంగళవారం ఎన్ఏడీ, మద్దిలపాలెం, బో యపాలెం, గాజువాక, షీలానగర్, బీచ్ రోడ్డు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. ఇప్పటి వరకు ఏడు బస్సులపై కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ తనిఖీలు ఈ నెల 30 వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు. మోటార్ వాహన తనిఖీ అధికారులు బుచ్చిరాజు, గణేష్ రెడ్డి, బాలాజీరావు, హరి ప్రసాద్, మన్మోహన్, శ్రీనివాస్ యాదవ్, పి.శిరీష, సత్యంనాయుడు, సృజన, మాధవి తదితరులు పాల్గొన్నారు.



అదుపు తప్పిన ఆర్టీసీ బస్

ద్విచక్ర వాహనం, రక్షణ గోడ ధ్వంసం

మల్కాపురం: ఆర్టీసీ బస్ అదుపు తప్పి.. సేవా మార్గంలోని రక్షణ గోడను ఢీకొట్టింది. బస్‌లో ప్రయాణికులు లేకపోవడం, రక్షణ గోడ వద్ద జన సంచారం లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. ఈ ఘటనలో నేవీ ఉద్యోగికి చెందిన బైక్ దెబ్బతింది. వివరాలివీ.. గాజువాక డిపోకు చెందిన 55కే బస్ మంగళవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో కొత్తవలస నుంచి సింధియా వైపు వస్తోంది. మార్గమధ్యలో షిప్‌యార్డ్ కమర్షియల్ కాంప్లెక్స్ దగ్గరకు రాగానే బస్ ముందు చక్రానికి మధ్య గల హైడ్రోలిక్ బ్రేక్ పైపు డివైడర్‌కు రాసుకుంది. ఈ క్రమంలో డివైడర్‌లో పైపు చిక్కుకుపోవడంతో ఆందోళనకు గురైన డ్రైవర్ వేగాన్ని పెంచాడు. దీంతో బస్ అదుపు తప్పింది. గత్యంతరం లేని పరిస్థితిలో బస్ డ్రైవర్ కమర్షియల్ కాంప్లెక్స్ పక్కన గల షిప్‌యార్డ్ ఉద్యోగుల కాలనీ రక్షణ గోడను ఢీకొట్టాడు. అక్కడకు సమీపంలో ఫుట్‌పాత్‌పై కొంత మంది పండ్లు, కూరగాయల వ్యాపారం చేస్తున్నారు. బస్ తమ మీదకు వస్తుందేమోనని భయపడి.. వ్యాపారులు అక్కడ నుంచి తప్పుకొన్నారు. కాగా.. ఓ నేవీ ఉద్యోగి కొబ్బరి బొండం తాగేందుకు తన వాహనాన్ని పండ్ల దుకాణం వద్ద నిలిపాడు. అతని వాహనాన్ని బస్ బలంగా ఢీకొనడంతో దెబ్బతింది. సమాచారం అందుకున్న మల్కాపురం పోలీసులు అక్కడకు చేరుకుని.. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు.


షిప్‌యార్డ్ కాలనీ రక్షణ గోడను ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు

స్టీల్‌ప్లాంట్ సమాచారం

బీఎఫ్-3లో ఉత్పత్తి పునరుద్ధరించాలి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్ ఫర్నేస్–3లో ఉత్పత్తి పునరుద్ధరణకు యాజమాన్యం వెంటనే చర్యలు తీసుకోవాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు డిమాండ్ చేశారు. సెంట్రల్ స్టోర్స్ కూడలి వద్ద మంగళవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతేడాది జనవరి నుంచి విభాగంలో ఉత్పత్తిని నిలిపివేయడం వల్ల వార్షిక లక్ష్యాలు సాధించలేకపోతున్నామన్నారు. మంచి మార్కెట్ ఉన్న పరిస్థితిలో ఉత్పత్తి తగ్గడం వల్ల కంపెనీ టర్నోవర్ తగ్గుతోందన్నారు. మూడు ఫర్నేస్‌లు నడిపితే కంపెనీ లాభాల బాటన పడుతుందన్నారు. కార్మికులు లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, ఎల్‌టీసీ, ఎల్‌టీపీ తదితర సమస్యల పరిష్కారానికి యాజమాన్యం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బీఎంకె నాయక్, కొమ్ము ప్రసాద్, డి .మోహన్, అవతారం,ఎస్.ఎ. నాయుడు, జి.ప్రభాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నీరుకొండ